‘భూ భారతి’ సర్వే షురూ

- ఫైలెట్ ప్రాజెక్టుగా సాలార్‌నగర్
- గ్రామస్తులతో గ్రామసభలు
- కొనసాగుతున్న సర్వేలు
- గ్రామ కంఠం, శివారు పరిధి గుర్తింపు
- సర్వే నంబర్ల వారీగా హద్దుల నిర్ణయం
- భూ సమస్యల పరిష్కారంపై ఆశాభావం



పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపికైన సాలార్‌గనర్ వ్యూ

గండేడ్: భూ భారతిలో భాగంగా పైలెట్ ప్రాజెక్టు కింద భూ సర్వే కోసం సాలార్‌నగర్ గ్రామాన్ని ఎంపిక చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆయా జిల్లాల్లో ఐదు గ్రామాలను గుర్తించగా అందులో మహబూబ్‌నగర్ జిల్లా నుంచి గండేడ్ మండలంలోని సాలార్‌నగర్‌ను ఎంపిక చేశారు. పెద్దవార్వాల్ గ్రామం అనుబంధ గ్రామమైన కొత్త గ్రామ పంచాయతీల ఏర్పాటులో భాగంగా సాలార్‌నగర్ నూతన గ్రామ పంచాయతీగా ఆవిర్భవించింది. సుమారు 500 మంది జనాభా కల్గిన ఈ గ్రామం సాలార్‌నగర్ ప్రాజెక్టును ఆనుకొని ఉంది. ఈగ్రామ పరిధి 122 సర్వే నంబర్లలో 422 ఎకరాల్లో విస్తరించి ఉంది.

గ్రామంలో గ్రామసభలు..

భూభారతిలో భాగంగా ఆయా గ్రామాల పరిధిలో గ్రామకంఠం, వ్యవసాయ భూములు, వ్యవసాయ ఆమోదం కాని భూములు, అటవీ భూములు, ప్రాజెక్టులు, చెరువులు, కుంటలు ఇతరత్రా ఎన్ని ఎకరాల్లో ఉన్నాయో గుర్తించి హద్దులు నిర్ణయించాలన్నదే లక్ష్యం. ఇందులో భాగంగా జాయింట్ డైరెక్టర్ ప్రసన్న లక్ష్మీ సర్వే అండ్ ల్యాండ్స్ గారి ఆదేశానుసారం సర్వేపనులు ఈనెల 7న ప్రారంభించారు. ఇందులో భాగంగా మొదటగా కిషన్‌రావు అసిస్టెంట్ డైరెక్టర్ ల్యాండ్స్ అండ్ సర్వే మహబూబ్‌నగర్, డీటీ మాధవి, సర్వేయర్ నీలిమ ఇతర అధికారులు గ్రామసభలు నిర్వహించి రైతులకు, గ్రామస్తులకు అన్ని విషయాలు వివరించారు. పైలెట్ ప్రాజెక్టు ఎంపిక దాని లక్ష్యం వివరించారు.

మ్యాపుల పరిశీలన..

సర్వే పనులు ప్రారంభానికి ముందు గ్రామానికి సంబంధించిన మ్యాపులను పరిశీలించారు. గ్రామ పరిధి ఏఏ గ్రామాలతో ముడిపడి ఉంది అన్న విషయాలను మ్యాపు ద్వారా పరిశీలించారు. ఈ గ్రామానికి చుట్టూ పెద్దవార్వాల్, జక్లపల్లి, బైస్‌పల్లి, సాలార్‌నగర్ ప్రాజెక్టు ఫారెస్టు వంటివి ఉన్నట్లు గుర్తించారు. ఈ గ్రామానికి సంబంధించిన మ్యాపు పూర్తిస్థాయిలో ఉండడంతో వీటన్నింటిని సులభంగా అధికారులు గుర్తిస్తున్నారు.

ప్రారంభమైన సర్వే..

పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపికైన సాలార్‌నగర్ గ్రామంలో ఇప్పటికే సర్వే పనులు ప్రారంభమయ్యాయి. ల్యాండ్స్ అండ్ సర్వే ఏడీ కిషన్‌రావుతో పాటు డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ మండల సర్వేయర్‌తో పాటు మరో ఇద్దరు సర్వేయర్లు సర్వేను ప్రారంభించారు. ఇప్పటికే డిజిటల్ సర్వే ద్వారా గ్రామకంఠం గుర్తింపు పూర్తయినట్లు సర్వే అధికారులు తెలిపారు. మిగతా గ్రామ పరిదిలోని మిగతా హద్దుల సర్వే చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. అందులో ఎన్ని చెరువులు, కుంటలు, పొలాలు, పోడు భూములు, అడవి భూములను గుర్తించనున్నారు.

సర్వే నంబర్ల వారీగా..

గ్రామ పరిధి గుర్తింపు పూర్తయ్యాక ఆ పరిదిలో ఏఏ సర్వే నంబర్లు ఉన్నాయో సర్వే చేస్తారు. ఆ సర్వేనంబర్లలో ఎన్ని ఎకరాల భూమి ఉంది, ఆర్‌ఎస్‌ఆర్‌కు ఎంత ఉంది ఎంతమంది రైతులున్నారు, వారికి ఎంత భూమి ఉందన్న విషయాలు పరిశీలించనున్నారు. వీటన్నింటి ఆధారంగా ఆయా సర్వే నంబర్లకు హద్దులు నిర్ణయించాలన్నది ప్రభుత్వ సంకల్పం. పొరుగు రాష్ట్రం అయిన కర్ణాటకలో ప్రతి సర్వేనంబరు కూడా హద్దులతో కూడుకుని ఉంటుంది. దీని ఆధారంగా రిజిస్ట్రేషన్లు జరుగుతాయి. ఫలితంగా భవిష్యత్‌లో ఎలాంటి సమస్యలు తలెత్తవు. ఇదే తరహాలో ఇక్కడ కూడా చేపట్టాలన్న యోచనలో ఉంది. దీని అమలులో భాగంగా పైలెక్టు ప్రాజెక్టు కింద గ్రామాల ఎంపిక జరిగింది. ప్రభుత్వ ఆదేశానుసారం సర్వే పనులు అధికారులు వేగవంతం చేస్తున్నారు. సర్వేనంబర్ల సర్వే సమయంలో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంది. వీటి పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోనున్నారు. ఏది ఏమైనా అన్ని గ్రామాల్లో ఈ సర్వే చేసి హద్దులు నిర్ణయిస్తే భూసమస్యలే ఉండవని పలు గ్రామాల ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



సాలార్‌నగర్‌లో డిజిటల్ సర్వే చేస్తున్న అధికారులు

అధికారుల ఆదేశానుసారం..



పైలెట్ ప్రాజెక్టు కింద చేపట్టిన పనులు ఎ ప్పుడు పూర్తవుతాయనేది ఖచ్చితంగా చెప్ప లేం. ముందుగా గ్రామసభలతో మొదలు పెట్టాం. గ్రామకంఠం గుర్తింపు పూర్తయ్యింది. గ్రామపరిధి సర్వే ప్రారంభం అయ్యింది. దీని తర్వాత సర్వేనంబర్ల సర్వే ప్రారంభం అవుతుంది. ఎప్పుడు ఏం చేయాలన్నది ఉన్నతాధికారులు సూచిస్తున్నారు. వారి సూచన మేరకు ముందుకెళ్తున్నాం. సర్వేల్లో ఇబ్బందులు తలెత్తితే వాటిని ఉన్నతాధికారుల అధికారులు దృష్టికి తీసుకెళ్తాం.

– మాధవి, ఇన్‌చార్జి తహసీల్దార్, గండేడ్

మెయిన్ పైపులైన్‌కు మరమ్మతు

- ‘సాక్షి’ కథనానికి స్పందన



సాక్షి ఎఫెక్ట్..

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ఎట్టకేలకు స్థానిక అశోక్ టాకీస్ చౌరస్తా లోని బాలగంగాధరతిలక్ విగ్రహ సమీపంలో దెబ్బతిన్న మిషన్ భగీరథ పథకం మెయిన్ పైపులైన్‌కు శనివారం మున్సిపల్ అధికారులు మరమ్మతు పనులు చేపట్టారు. వాస్తవానికి కొన్ని రోజులుగా ఈ ప్రాంతంలో రెండు చోట్ల, అలాగే కొన్ని నెలలుగా న్యూటౌన్‌చౌరస్తాలోని అబ్దుల్ కలాం విగ్రహం సమీపంలో లీకేజీలు ఏర్పడి తాగునీరు వృథాగా రోడ్డుపై పారుతోంది. ఇదే విషయమై ‘సాక్షి’లో ఈనెల 13న ‘హైవేపై పైప్‌లైన్ లీకేజీలు’ శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన మున్సిపల్ అధికారులు తాజాగా ఈ పనులు మొదలు పెట్టడం గమనార్హం.

ఆర్టీఐ కార్యకర్తల ఫోరం అధ్యక్షుడిగా ఆర్. భూపతిరెడ్డి

భూత్పూర్: మండల సమాచార హక్కు చట్టం కార్యకర్తల ఫోరం భూత్పూర్ మండల అధ్యక్షుడిగా ఆర్. భూపితిరెడ్డి, ఉపాధ్యక్షుడిగా వీ.ప్రదీప్‌కుమార్‌ను నియమించినట్లు శనివారం ఆర్.భూపతిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల సమాచార హక్కు చట్టం రాష్ట్రంలో కొత్త అధికారులను నియమించడంతో జిల్లాలు, మండలాల వారీగా ఆర్టీఐ కార్యకర్తల నియామకాలను రాష్ట్ర కమిటీ నియమిస్తున్నట్లు మండల అధ్యక్షుడు భూపతిరెడ్డి తెలిపారు.

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రాజాపూర్: మండలంలోని గుండ్లపొట్లపల్లి 33 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోని కల్లేపల్లి, అగ్రహారం పొట్లపల్లి, గుండ్లపొట్లపల్లి, బీబీనగర్‌తో పాటు తండాలలో ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని మండల విద్యుత్ శాఖ అధికారి వెంకటేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ తీగలకు తగులుతున్న చెట్లకొమ్మల నరికివేత కార్యక్రమం ఉంటుందని తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని పేర్కొన్నారు.

నిప్పంటుకొని పశుగ్రాసం దగ్ధం



గండేడ్: ప్రమాదవశాత్తు నిప్పంటుకొని పశుగ్రాసం కాలిపోవడంతో పాటు డీసీఎం పాక్షికంగా దెబ్బతిన్నది. ఈ సంఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. అంచన్‌పల్లి గ్రామానికి చెందిన చాపల మాసయ్య తన డీసీఎం లో నిత్యం పశుగ్రాసం (బొప్ప) తరలించేవాడు. ఎప్పటిలాగే శనివారం సల్కర్‌పేట్ సమీపంలో డీసీఎం లోడు చేశారు. వాహనాన్ని స్టార్టు చేయగానే మంటలు వ్యాపించి పశుగ్రాసానికి అంటుకుంది. వెంటనే అక్కడున్న కూలీలు స్పందించి నీళ్లు పట్టి మంటలు ఆర్పారు. పశుగ్రాసం దాదాపుగా పూర్తిగా కాలిపోయింది. డీసీఎం పాక్షికంగా దెబ్బతిన్నది. సకాలంలో స్పందించి మంటలు ఆర్పడంతో పెద్ద ప్రమాదం తప్పింది.

జెడ్పీజీపీఎఫ్ స్లిప్స్ ఆన్‌లైన్ చేయాలని వినతి



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: 2024–25 విద్యాసంవత్సరానికి సంబంధించి జెడ్పీజీపీఎఫ్ స్లిప్స్ ఆన్‌లైన్ చేయాలని కోరుతూ పీఆర్టీయూ నాయకులు జెడ్పీసీఈఓ వెంకట్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు, కార్యదర్శులు మధన్‌మోహన్ యాదవ్, సుధాకర్‌రెడ్డిలు మాట్లాడుతూ స్లిప్‌లు ఆన్‌లైన్ చేసిన తర్వాత అందుకు సంబంధించి జమ అయిన వడ్డీ నిధులను కూడా జమ చేయాలని కోరారు. ఈ సందర్భంగా సీఈఓ స్పందిస్తూ సమస్యలను పరిష్కరిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో బుచ్చారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గండేడ్ తహసీల్దార్‌కు పదోన్నతి

గండేడ్: గండేడ్ మండల తహసీల్దార్ నాగలక్ష్మి బదిలీ అయ్యారు. రెండు రోజుల క్రితం రాష్ట్ర వ్యాప్తంగా తహసీల్దార్ల బదిలీల ప్రక్రియలో నాగలక్ష్మిని నారాయణపేట జిల్లాకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు వచ్చాయి. దీంతో ఆమెను సిబ్బంది ఘనంగా సన్మానించారు. డీటీ మాధవితో పాటు ఎంపీడీఓ దేవన్న రెండు కార్యాలయాల సిబ్బంది ఉన్నారు. ఈ సందర్భంగా తనకు సహకరించిన సిబ్బందికి, ప్రజాప్రతినిధులు, అధికారులకు ఆమె ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ యాసిన్, రికార్డు అసిస్టెంట్ రుక్మిణి, జూనియర్ అసిస్టెంట్లు రాంచంద్రయ్య, సత్యయ్య, వీఆర్‌ఏ నరేష్, ఆపరేటర్ అశోక్, తదితరులు పాల్గొన్నారు.

42 శాతం రిజర్వేషన్‌లో యాదవుల వాటా ఎంత?



మహబూబ్‌నగర్ రూరల్: కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని చెప్పినప్పటికీ ఏ కులానికి ఎంత రిజర్వేషన్ వర్తింపజేస్తారో స్పష్టం చేయాలని యాదవ విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు చలకాని వెంకట్‌యాదవ్ డిమాండ్‌చేశారు. శనివారం టీఎన్జీఓ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 12 శాతం యాదవులున్నారని, తమ జనాభాకు అనుకూలంగా రిజర్వేషన్ వాటాను ప్రకటించాలన్నారు. కేంద్రంలోని బీజేపీ 42 శాతం రిజర్వేషన్‌కు చట్టబద్ధత కల్పించి, ఈ బిల్లుకు 9వ షెడ్యూల్‌లో చేర్చాలని డిమాండ్ చేశారు. అనంతరం కాంగ్రెస్ ఓబీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన రమేష్‌యాదవ్‌ను, జిల్లా ఉద్యోగుల సంఘం జేఏసీ కో–చైర్మన్‌గా నియమించిన జుర్రు నారాయణయాదవ్‌ను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో విద్యావంతుల వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బైకని బాలుయాదవ్, అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర కార్యదర్శి రవికుమార్‌యాదవ్, యాదవ విద్యావంతుల వేదిక జిల్లా అధ్యక్షుడ అంజయ్యయాదవ్, యాదవ ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్రాములు యాదవ్, నాయకులు పాల్గొన్నారు.

ఆధునిక పద్ధతులతో అధిక దిగుబడి

- ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి



విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

జడ్చర్ల: రైతులు ఆధునిక విధానాలను అవలంభించి అధిక పంట దిగుబడి సాధించాలని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి తెలిపారు. శనివారం స్థానిక ఆగ్రో ఫార్మసీ కేంద్రం వద్ద రైతులకు జీలుగ, జనుము సబ్సిడీ విత్తనాలను పంపిణీ చేశారు. వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తలను సంప్రదించి ఎప్పటికప్పుడు మారుతున్న కాలానుగునంగా పంటలు సాగు చేసుకోవాలన్నారు. తమ ప్రభుత్వం వ్యవసాయానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. రైతులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు చేపట్టాలని సంబంధిత వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. విత్తనాలు, ఎరువుల కొరత లేకుండా చూడాలన్నారు. రైతులు నాసిరకం విత్తనాలను సాగు చేసి నష్టపోవద్దని ఈ సందర్భంగా సూచించారు. తాము కొనుగోలు చేసిన విత్తనాలు, ఎరువులకు సంబంధించి తప్పనిసరిగా బిల్లులు తీసుకోవాలన్నారు. జీలుగ 30 కిలోల విత్తనాల బస్తా 50 శాతం సబ్సిడీ పోగా ధర రూ.2137 చెల్లించాలని, జనుము 40 కిలోల బస్తా 50 శాతం సబ్సిడీ పోగా రూ.2510 చెల్లించాలని ఏడీఏ కృష్ణకిషోర్ రైతులకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఏఓ గోపినాథ్, జిల్లా కిసాన్ ఖేత్ అధ్యక్షులు జనార్దన్‌రెడ్డి, డీలరు అమర్‌నాథ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

‘ఉపాధి’ పనులు పర్యవేక్షించాలి

- డీఆర్‌డీఓ నర్సింహులు
- మూసాపేటలో 4వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక
- కార్యదర్శులు, టీఏలకు షోకాజ్ నోటీసులు




మూసాపేటలో ఉపాధిహామీ ప్రజావేదికలో మాట్లాడుతున్న డీఆర్‌డీఓ నర్సింహులు

అడ్డాకుల: గ్రామాల్లో జరిగే ఉపాధి హామీ పనులను సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని డీఆర్‌డీఓ నర్సిములు అన్నారు. మూసాపేట మండల కేంద్రంలోని రైతు వేదికలో శనివారం జరిగిన 4వ విడత సమాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. 2024 ఏప్రిల్ 1నుంచి 2025 మార్చి 31 వరకు మండల వ్యాప్తంగా ఎన్‌ఆర్‌ఈజీఎస్‌లో రూ.3.33కోట్లు, పీఆర్‌లో రూ.1.41కోట్ల పనులు జరిగాయి. వాటిపై ఇటీవల తనిఖీ బృందం గ్రామాల్లో విచారణ చేపట్టి నివేదిక రూపొందించారు. ఏపీడీ ముసాయిదాబేగం, ఫైనాన్స్ మేనేజర్ ప్రేమలత, అంబుడ్స్‌మెన్ సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ప్రజావేదికకు డీఆర్‌డీఓ నర్సింహులు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మొక్కల పెంపకంలోనే ఎక్కువగా అవకతవకలు జరిగినట్లు తనిఖీ బృందం గుర్తించింది. తక్కువ సంఖ్యలో మొక్కలు నాటి, ఎక్కువ రికార్డు చేయించడం, వాటర్ ట్యాంకర్ పేమెంట్ చేసినా చాలా చోట్ల మొక్కలు ఎక్కువగా ఎండిపోవడం నివేదికలో వెల్లడైంది. దీంట్లో చక్రాపూర్, నందిపేట, దాసర్‌పల్లి, స్ఫూర్తితండా, కొమిరెడ్డిపల్లి గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ టీఏలకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని సిఫారసు చేసినట్లు ఎస్‌ఆర్‌పీ కె.స్వామి తెలిపారు. తనిఖీ బృందాలు గుర్తించిన దాంట్లో మండల వ్యాప్తంగా సుమారు రూ.54లక్షల మేర అవకతవకలు జరిగినట్లు గుర్తించగా ప్రజావేదికలో మాత్రం అధికారులు రూ.వేలల్లోనే ఉందని లెక్క తేల్చడం గమనార్హం. మండలంలోని గ్రామాల్లో జరిగిన ఉపాధి పనులను సరిగ్గా పర్యవేక్షించలేదని విచారణ సందర్భంగా పలుమార్లు ఎంపీడీఓ కృష్ణయ్యను డీఆర్‌డీఓ మందలించారు.

రైతులకు మేలు జరిగే వాటికి ప్రాధాన్యం

ఉపాధిహామీలో రైతులకు మేలు జరిగే పనులకే ఎక్కువగా ప్రధాన్యం ఇవ్వాలని డీఆర్‌డీఓ నర్సింహులు అన్నారు. ప్రజావేదిక పూర్తయిన తర్వాత ఆయన మాట్లాడుతూ చిన్న, సన్నకారు రైతులకు ఉపయోగపడే పనులతో పాటు ఫీడర్ ఛానల్, చెక్‌డ్యాం వంటి పనులను చేయించేలా చూడాలని చెప్పారు. ఉపాధి పనును ఎప్పటికప్పుడు రికార్డుల్లో నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. ఎంపీడీఓలు, ఏపీఓలు గ్రామాల్లో జరిగే పనులను పర్యవేక్షిస్తే అవకతవకలకు ఆస్కారం ఉండదని చెప్పారు. పారదర్శకంగా పనులు జరిగేలా ఉపాధిహామీ సిబ్బంది పని చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కృష్ణయ్య, ఎంపీఓ అనురాధ, ఇన్‌చార్జి ఏపీఓ పులేందర్, ఎస్‌ఆర్‌పీ కె.స్వామి, డీఆర్‌పీలు సతీష్, పావని, రాము, వెంకటేష్, కుమార్, అశోక్, కార్యదర్శులు, ఎఫ్‌ఏలు, మేటీలు తదితరులు ఉన్నారు.

పకడ్బందీగా ఉపాధ్యాయుల శిక్షణ



అధికారులతో విద్యాశాఖ సమగ్రశిక్ష జాయింట్ డైరెక్టర్ వెంకటనర్సమ్మ

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఉపాధ్యాయుల శిక్షణ పకడ్బందీగా, ఎటువంటి లోటు పాట్లకు తావు లేకుండా నిర్వహించాలని విద్యాశాఖ సమగ్రశిక్ష జాయింట్ డైరెక్టర్ వెంకటనర్సమ్మ జిల్లా విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని భగీరథ కాలనీ వద్ద ఉన్న మైనార్టీ గురుకులంలో జరుగుతున్న ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమానికి ఆమె హాజరై శిక్షణ సరళిని పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈఓ ప్రవీణ్‌కుమార్‌తో సమావేశమై పలు అంశాలతో చర్చించారు. ఎంత మంది ఉపాధ్యాయులకు శిక్షణకు వస్తున్నారని, ప్రస్తుతం ఏ అంశాలపై శిక్షణ ఇస్తున్నారని, రెండో దశంలో ఎంత మంది ఉపాధ్యాయులు హాజరవుతారని అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయుల శిక్షణలో పూర్తి స్థాయిలో అంశాలను అవగాహన కలిగేలా చూడాలన్నారు. దీంతో పాటు తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ శివయ్య, వయోజన విద్య జిల్లా అధికారితో పాటు పలువురు అధికారులను పలు కార్యక్రమాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏఎంఓ దుంకుడు శ్రీనివాస్, సీఎంఓ బాలుయాదవ్ పాల్గొన్నారు.

సత్వర న్యాయం కోసం లోక్ అదాలత్



మహబూబ్‌నగర్ రూరల్: చిన్నారులు, వృద్ధులు, మహిళలు ఎవరికైతే న్యాయ సహాయ సహకార సంరక్షణ, జీవనోపాధి కోసం అవసరం ఉన్న వ్యక్తులు జిల్లా న్యాయసేవా సమితి నుంచి ఉచిత న్యాయ సహాయ, సహకారాలు అందిస్తామని జూనియర్ సివిల్ జడ్జి భావన అన్నారు. శనివారం మండల పరిధిలోని జమిస్తాపూర్‌లో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి భావన గృహ నిరోధక చట్టం, బాల్య వివాహాలు, వరకట్న నిషేధ చట్టం, విడాకులు, వైవాహిక సంబంధాల పునరుద్ధరణ, కుటుంబ తగాదాలు, ఎఫ్ఐఆర్, ర్యాగింగ్, సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. స్వతర న్యాయానికి లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలని కోరారు. తహసీల్దార్ సుందర్‌రాజ్ మాట్లాడుతూ కుటుంబానికి ఆరోగ్యపరంగా, సామాజికంగా ఆశా వర్కర్లు, ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ టీచర్లు, ఐకేపీ సభ్యులు ముఖ్య పాత్ర వహించాలన్నారు. ఎంపీడీఓ కరుణశ్రీ మాట్లాడా రు. ఈ సదస్సులో ప్యానెల్ న్యాయవాదులు శివరాజ్, మల్లారెడ్డి, రవీంద్రనాయక్, పీఎల్‌వీ నాగభూషణం, కాడం రాఘవేందర్, శివన్న, రాము పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణం ప్రారంభం

మిడ్జిల్: మండల కేంద్రంలో శనివారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పనులు జడ్చర్ల మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జ్యోతి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి నిరుపేదకు ఇందిరమ్మ ఇళ్లు వస్తుందని, గ్రామాలలో ఎవరు కూడా నిరాశ చెందవద్దని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గీతాంజలి, ఎంపీఓ ఆనంద్, ఏఈ విజయ్‌కుమార్, నాయకులు అల్వాల్‌రెడ్డి, వెంకటయ్య, సాయిలు, గోస్, ప్రశాంత్, మల్లికార్జున్‌రెడ్డి, బంగారు, సత్యం, రామ్‌గౌడ్ పాల్గొన్నారు.

ప్రజా నాయకుడు ఈర్ల నర్సింహ



జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తు ప్రజా నాయకుడిగా ఈర్ల నర్సింహ పేరు తెచ్చుకున్నారని సీపీఐ జిల్లా కార్యదర్శి బాలకిషన్ అన్నారు. ఈర్ల నర్సింహ 2వ వర్ధంతి సందర్భంగా శనివారం ఆ పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. వెలుగొండ గ్రామ సర్పంచ్‌గా, ఎంపీటీసీగా బిజినపల్లి వైఎస్ ఎంపీపీగా, ఉమ్మడి జిల్లా పార్టీ కార్యదర్శిగా పని చేశార న్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా నాయకులు కొండప ల్లిరాము, జిల్లా కౌన్సిల్ సభ్యులు చాంద్‌పాషా, హనుమంతు, రవి, శ్యాం, మోహన్ పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో వేగం పెంచాలి

నవాబుపేట: మరో నెలరోజుల్లో వర్షాకాలం ప్రారంభం కాబోతున్న తరుణంలో వేసవికి సబంధించిన ఉపాధి పనులు పూర్తి చేసేలా చూడాలని ఉపాధి హామీ పథకం ఏపీఓ జ్యోతి తెలిపారు. శనివారం మండల కేంద్రంలో జరిగిన ఉపాధి సిబ్బంది సమీక్షలో ఆమె మాట్లాడారు. గ్రామాల్లో ఉపాధి పనులు ఎండలకు కాస్త నెమ్మదిగా సాగిన తరుణంలో తాజాగా ఉన్న పరిస్థితుల ప్రకారం పనుల్లో వేగం పెంచాలని ఆమె సూచించారు. కూలీల సంఖ్యను సైతం పెంచాలన్నారు. ఉపాధి సిబ్బందికి మూడు నెలల వేతనాలు ఖాతాలో జమైనట్లు ఆమె వివరించారు.

స్థానిక ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు డిపాజిట్లు దక్కవు

- ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

దేవరకద్ర: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు డిపాజిట్లు కూడా దక్కవని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని శ్రీనివాసగార్డెన్‌లో జరిగిన నియోజకవర్గ స్థాయి కాంగ్రెస్ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ఒక్క పిలుపుతో తరలి వచ్చిన కాంగ్రెస్ శ్రేణులు ఇదే ఉత్సాహం, పట్టుదలతో స్థానిక ఎన్నికల్లో జయకేతనం ఎగురవేయాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి గడపకు తీసుకు పోవా లని కోరారు. జూన్ చివరి వారం లేక జూలై మొదటి వారంలో స్థానిక ఎన్నికలు రాబోతున్నాయని, ఇప్పటి నుంచే కార్యకర్తలు సంసిద్ధం కావాలని కోరారు. పార్టీని నమ్ముకున్న వారికి ప్రాధాన్యత క్రమంలో పదవులు వరిస్తాయని తెలిపారు. గోపన్‌ప ల్లిలోని చెరువుకు కోయిల్‌సాగర్ నీటిని అందించడా నికి అధికారులతో మాట్లాడుతామని ఎమ్మెల్యే తెలిపారు.

గెలుపే లక్ష్యంగా పని చేయాలి

అభ్యర్థులు ఎవరైనా కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పని చేయాలని పార్టీ పరిశీలకులు దొమ్మటి సాంబయ్య కోరారు. పార్టీ నిర్మాణమే ముఖ్యమని సంస్థాగతంగా బలోపేతం చేయడం కోసం ఐక్యంగా పని చేయాలని తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న రాజ్యాంగ వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని తలపెట్టిన జై బాపు, జైభీమ్, జై సంవిధాన్‌ను గ్రామస్థాయి బూత్ స్థాయికి చేర్చాలని కోరారు. బ్లాక్, మండల, గ్రామ పార్టీ అధ్యక్ష పదవులకు దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు. సమావేశంలో మరో పరిశీలకులు భాస్కర్ యాదవ్, టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ అరవింద్ రెడ్డి, మార్కెట్ చైర్మన్లు ప్రశాంత్, కతలప్ప, కాంగ్రెస్ మండల అధ్యక్షులు అంజిల్‌రెడ్డి, రాఘవేందర్‌రెడ్డి, కోనరాజశేఖర్, హన్మంతరెడ్డి, నాగిరెడ్డి, శేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గోపన్‌పల్లిలో స్ప్రింకర్ల పంపిణీ

మండలంలోని గోపన్‌పల్లిలో సీసీరోడ్లు ఇంకా పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి భూమిపూజ చేసి ప్రారంభించారు. అదే విధంగా రైతులకు స్ప్రింక్లర్లు, జీలుగ విత్తనాలు పంపిణీ చేశారు.

చదువు, ఆటపాటల్లో రాణించాలి



సమ్మర్ క్యాంపులో చిన్నారులతో మాట్లాడుతున్న డాక్టర్ మధుసూదన్‌రెడ్డి

మహబూబ్‌నగర్ రూరల్: విద్యార్థులు చదువుతో పాటు ఆట పాటల్లో ముందుండాలని సుశ్రుత ప్రజా వైద్యశాల ఎండీ డాక్టర్ మధుసూదన్‌రెడ్డి అన్నారు. శనివారం దివిటిపల్లి డబుల్ బెడ్రూం కాలనీలో బాలకిష్టయ్యగౌడ్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపులో విద్యార్థులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. పేద విద్యార్థుల కోసం ఇలాంటి క్యాంపులు ఏర్పాటు చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. 15 రోజుల పాటు విద్యార్థులకు ఇంగ్లిష్, గణితం, నృత్య తరగతులు నిర్వహించడం జరుగుతుందని, చివరి రోజు విద్యార్థులు నేర్చుకున్న అంశాలపై ప్రదర్శన ముగింపు సభ ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది బెక్కం జనార్దన్, సమ్మర్ క్యాంపు నిర్వాహకులు కడియాల మోహన్, నాయకులు మల్లెల మాణిక్యం రాజు, భాస్కర్, మీసాల కుర్మయ్య, డ్యాన్స్ మాస్టర్లు యాదవకుమార్, గణేష్, ఆసియాబేగం, తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలు నిర్వహించడం అభినందనీయం

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రంలో పట్టణ జాంద్ర యువజన సంఘం ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు నిర్వహించడం అభినందనీయమని వన్‌టౌన్ సీఐ అప్పయ్య అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహిస్తున్న జేపీఎల్–3 శనివారం రెండో రోజుకు చేరింది. ఈ సందర్భంగా క్రీడా జట్లను సీఐ పరిచయం చేసుకొని అభినందించారు. కార్యక్రమంలో పట్టణ జాంద్ర యువజన సంఘం అధ్యక్షులు సద్దె పవన్‌కుమార్, ప్రధాన కార్యదర్శి టంకశాల మల్లేష్, కోశాధికారి పోతినెపల్లి అనిల్‌కుమార్, ఉపాధ్యక్షులు దోమ సాయికుమార్, నాగలి విశ్వకాంత్, సంయుక్త కార్యదర్శులు పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని జిల్లా వాలీబాల్ సంఘం ప్రతినిధి, మాజీ కౌన్సిలర్ చెన్న వీరయ్య, డాక్టర్ బాలకృష్ణ అన్నారు. పట్టణ జాంద్ర యువజన సంఘం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని కుర్హినిశెట్టి కాలనీలో జాంద్ర కమ్యూనిటీహాల్లో శనివారం చెస్ పోటీలు ప్రారంభించారు.

సబ్సిడీపై జీలుగ విత్తనాలు



భూత్పూర్: సబ్సిడీపై జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నా యని మండల వ్యవసాయాధికారి జి. మురళీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. 30 కిలోల బ్యాగు రూ.2138 లకు సబ్సిడీపై రై తులకు ఇస్తున్నట్లు, మండల కేంద్రంలోని ఆగ్రో రైతు సేవ కేంద్రంలో 66 బస్తాలు, ప్రాథమిక వ్యవసాయ కేంద్రంలో 100 బ స్తాలు అందుబాటులో ఉన్నాయని ఏఓ పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినయోగం చేసుకోవాలని కోరారు.

అందుబాటులో పచ్చిరొట్ట విత్తనాలు

మహమ్మదాబాద్: వర్షాకాలంలో వరి ఇతర పంటలు సాగుచేసే రైతులకు తమ పొలాల్లో పచ్చిరొట్ట ఎరువులు సాగుచేసే విత్తనాలు అందుబాటులో ఉ న్నట్లు వ్యవసాయాధికారి నరేందర్ తెలిపారు. శనివారం మహమ్మదాబాద్ ఆగ్రోస్‌సెంటర్ ద్వారా రైతులకు ఎరువుల విత్తనాలు పంపిణీ చేశారు. రైతు లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా విత్తనాలు సాగు చేసుకోవాలన్నారు.

IN THE COURT OF ADDL JUNIOR CIVIL JUDGE AT JADCHERLA

OS No 228 OF 2023

BETWEEN:

Mohd Ateeq Ur Rahmaan Rep by his GPA holder/Wife Anees Sulthana ...plaintiff

And

Mohd Sulthan pasha and others ...defendants

To,

1. Mohd Sulthan pasha, S/o Mohd. Shuzauddin, aged: 55 years, Occ: Business, R/o H.No: 1-10-65/5/F/1, Shah Saheb Gutta, Mahabubnagar

Take notice that the above named plaintiff filed suit seeking perpetual injunction against you and others. The case is posted to 12-06-2025 for your appearance. You are here by directed to appear in person or through advocate on 12-06-2025 at 10-30 a.m. before the above Hon'ble court; otherwise the matter will be decided as ex-parte in your absence.

"By the order of the court"

Sd/- C.RAJENDER KUMAR Advocate
Office Door No: 2-8-36,
Market road-Mahabubnagar - 509001
Telangana state Mobile: 9396311345